ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 31.0
కనిష్ఠం 24.8

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

3

ఆదివారం 15 సెప్టెంబరు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.10 (312.0450)	68,260	77,496
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.20 (4.24)	1,155	730
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.27 (44.64)	62,502	16,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.152 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260



నిర్మాణ దశలో సాగర్(ఫైల్)


అనంత ఆలోచనలు.. అద్భుత నిర్మాణాలు



అద్భుత నిర్మాణాలు చేపట్టాలంటే అనంత ఆలోచనలు చేయాలి. ఆ దృక్పథం కార్యరూపం దాల్చేందుకు అందులో ప్రజా ప్రయోజన ఫలితాలు ఎక్కువగా ఉండాలి. తరతరాలకు అందించే విధంగా ఆ పథకాల రూపకల్పన జరిగితే కలకాలం గుర్తుంటాయి. ఇలాంటి ఎన్నో యోచనలకు తుది రూపం ఇచ్చి కార్యాచరణ అమలు చేసే వారే ఇంజనీర్లు. వారి వ్యూహరచన, దూర దృష్టితో జిల్లాలో లక్షల ఎకరాలు సాగులోకి వచ్చాయి. బీడు భూముల్లో జలసిరులు సవ్వడి చేస్తున్నాయి. ఒకప్పటి కరువు నేలపై బంగారం పండేందుకు దోహదపడిన ఇంజనీర్ల దినోత్సవం..., మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

●5లో..

- ఇంజనీర్ల మేధో శక్తికి నాగార్జున సాగర్ నిదర్శనం
- జిల్లాలో సాగు నీటి కష్టాలు తీర్చిన యోధులెందరో
- నేడు ఇంజనీర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..



ఇంజనీర్ల కళ.. నాగార్జునసాగర్ నిర్మాణం



'స్థానికం'లో పట్టుకోసం పార్టీల గురి

- ఎన్నికల సంఘం ఏర్పాట్లతో పల్లెల్లో కదలిక
- ఇప్పటికే పూర్తయిన ఓటర్ల ముసాయిదా జాబితాలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీ రిజర్వేషన్ల కేటాయింపు ఎలా?
- బీసీ కులగణన తర్వాతే రిజర్వేషన్లు కేటాయించే అవకాశం
- ప్రభుత్వ నిర్ణయంపై రాజకీయ నేతల్లో ఉత్కంఠ

స్థానిక సంస్థల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం పల్లెల్లో ప్రత్యేక పాలక కొనసాగుతోంది. గ్రామపంచాయతీలు, మండల పరిషత్‌లతోపాటు జిల్లా పరిషత్‌లలో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేసి వీలైనంత త్వరగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆశిస్తున్నాయి. ఈ మేరకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తుండటంతో పల్లెల్లో పట్టుకోసం పార్టీలు గురిపెట్టాయి.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

పార్లమెంట్ ఎన్నికల అనంతరం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ముందస్తు ఏర్పాట్లపై దృష్టి కేంద్రీకరించింది. గ్రామపంచాయతీల పాలకవర్గం ఎన్నికలు మొదటగా నిర్వహించి, అనంతరం మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు చేసింది. ఈ మేరకు ఎన్నికల నిర్వహణపై అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాన్ని కూడా నిర్వహించింది. ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితాల ఖరారు, పోలింగ్‌స్టేషన్ల ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించింది. ఓటర్ల తుది జాబితా ప్రకటన అనంతరం రిజర్వేషన్ల వివరాలు ప్రభుత్వం ఎన్నికల సంఘానికి అందించాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ కలిపి 50 శాతానికి రిజర్వేషన్లు మించరాదని సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ ఎలాగుంటుందన్న అంశంపై తీవ్ర చర్చనీయాశమైంది. పల్లెల్లోని రాజకీయ పార్టీలకు చెందిన ఆశావహులు ఈసారి గ్రామాల్లో, మండల, జిల్లా పరిషత్‌ల్లో రిజర్వేషన్లు మారుతాయా? పాతవే కొనసాగుతాయా? ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. సుప్రీం కోర్టు ఆదేశాలు 50శాతానికి మించరాదు అని ఉండగా, ప్రభుత్వం బీసీ గణనను పూర్తి చేసి రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. మరోవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రస్తుతం ఉన్నట్లు గ్రామపంచాయతీల్లోని రిజర్వేషన్లు రెండు పర్యాయాలు (10సంవత్సరాలు)వరకు ఉండాలి.ప్రస్తుతం రిజర్వేషన్లు గత ప్రభు త్వం చేసిన చట్టం మేరకు ఉంటాయా? లేక మారుతాయా? అనేది కూడా స్పష్టత కోసం నేతలు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వపరంగా చేస్తున్న ఏర్పాట్లను పరిశీలిస్తే అక్టోబరు లేదా నవంబరులో గ్రామపంచాయతీ ఎన్నికలునిర్వహించే అవకాశం ఉంది. అనంతరం మం డల, జిల్లాపరిషత్‌లకు ఎన్నికలు జరిగే సూచనలు కన్పిస్తున్నాయి.

పట్టుకోసం పార్టీల యత్నాలు



స్థానిక సంస్థల ఎన్నికల్లో గత పదేళ్లపాటు బీఆర్ఎస్ పట్టు సాధిస్తూ వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓడిపోయి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీల్లో వలసలు ఊపందుకొని పార్టీ నేతలు అటు ఇటుగా మారారు. ఈ నేపథ్యంలో స్థానికంగా రాజకీయ పార్టీలు పట్టు నిలుపుకునేందుకు ఇప్పటి నుంచే తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ హవానే ఉంటుంది. ఈసారి కూడా రాజకీయాల్లో అదే సంప్రదాయం కొనసాగుతుందా? లేక ప్రతిపక్షం బలంగా ఉండనుందా? అని అంతా ఎదురుచూస్తున్నా రు. అయితే బీఆర్ఎస్‌కు చెందిన చాలా మంది ముఖ్యనేతలు కాంగ్రెస్‌లో చేరారు. వారంతా కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్న సీనియర్ నేతలు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ ఎవరికి ప్రాధాన్యం ఇస్తుందన్న అంశం చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్‌కు పల్లెల్లో ఇప్పటికీ కొంతమేర పట్టుంది. అయితే గతంలో ప్రజాప్రతినిధులుగా కొనసాగిన వారంతా పార్టీని వీడారు. దీంతో ఉన్నవారితో పార్టీని బలోపేతం చేసుకుని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ఆ పార్టీ ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ బలపడింది. అయితే ఆ పార్టీకి కూడా స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం ఉంది. ఈసారి మరింత బలపడి అధిక స్థానాల్లో గెలిచేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు గ్రామాల్లో పర్యటిస్తూ పార్టీ కార్యక్రమాలను నాయకులు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలతో పాటు వామపక్షాలు కూడా సన్నద్ధమవుతున్నాయి. అన్ని పార్టీలు కూడా స్థానికంలో పట్టు నిలుపుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి.

గత ఎన్నికల్లో రిజర్వేజషన్లు ఇలా

ఉమ్మడి జిల్లాలో 1,740 పంచాయతీలకు 2018లో ఎన్నికలు జరిగాయి. యాదాద్రి జిల్లాలో 420, నల్లగొండ జిల్లాలో 844, పేట జిల్లాలో 475 పంచాయతీలకు నాడు ఎన్నికలు జరిగాయి. 2018లో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌లో అన్ రిజర్వుడు (జనరల్) కేటగిరీకి 96 గ్రామపంచాయతీలు కేటాయించారు. అన్ రిజర్వుడు(మహిళలు) 94, ఎస్టీ జనరల్ 24, ఎస్టీ మహిళలు 33, ఎస్సీ మహిళలు 33, ఎస్సీ జనరల్ 33, బీసీ జనరల్ 59, బీసీ మహిళలకు 58 పంచాయతీలు కేటాయించారు. అయితే ఈసారి ప్రభుత్వం యాదాద్రి జిల్లాలో ఆరు నూతన గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసింది. మొత్తం 426 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. అదేవిధంగా నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో సైతం పంచాయతీల సంఖ్య పెరిగింది. ఈ సారి నిర్వహించే ఎన్నికల్లో రిజర్వేషన్ల కేటాయింపు ఎలా ఉంటుందోనని స్థానిక రాజకీయ నేతల్లో ఉత్కంఠ నెలకొంది.



ఉపాధి హామీ వ్యవసాయానికి అనుసంధానమయ్యేనా?

- అనుసంధానిస్తే రైతులకు మేలు, కూలీలకు ఉపాధి
- ప్రస్తుతం చేస్తున్న పనులకన్నా అదే మేలంటున్న రైతులు

ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. అయినా కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. కూలీలు ఎక్కువగా ఉపాధి హామీ పనులకు వెళ్తుండటంతో వ్యవసాయ పనులకు కొరత ఏర్పడుతోంది. దీంతో కూలీ రేటు పెరగడంతోపాటు, వ్యవసాయ పనులు సకాలంలో పూర్తికాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యంత్ర పరికరాలు ఎన్ని అందుబాటులోకి వచ్చినా చాలా పనులు కూలీల ద్వారానే చేయించాల్సి ఉంటుంది. దీంతో కూలీల కొర త ఏర్పడి రైతులు అగచాట్లు పడుతున్నారు.

- మోత్కూరు

యంత్ర పరికరాలు ఉన్నా బురద మడిలో వరాలు,నారు తీయడం,నాటు వేయడం, కలుపుతీత, మెట్ట పంటల విత్తనాలు విత్తడం, మందులు పిచికారీ చేయడం, పత్తి తీత, వేరుశనగ కాయలు తీయడం, జొన్న, సజ్జ,మొక్క జొన్న కంకులు విరవడం, ఆరబెట్టడం లాంటి పనులెన్నో కూలీలే చేయాల్సి ఉంటుంది. దీంతో కూలీల కొరత ఏర్పడి రైతులు వ్యవసాయ పనులు సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని పూర్తిస్థాయిలో అనుసంధానించాలని నీతి ఆయోగ్ 2016లోనే కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.ఎనిమిదేళ్లు గడిచినా ప్రభుత్వం ఆ వైపు దృష్టి సారించడం లేదు. ఉపాధి హామీలో చేపట్టే పొలం పనుల ఖర్చును 75శాతం రైతులు, 25శాతం ప్రభుత్వం భరించేలా సాగు పనులను ఉపాధి హామీలో చేర్చాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించి కేంద్ర ప్రభుత్వానికి పంపింది. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులకు పాట్లు తప్పడం లేదు.

ఉమ్మడి జిల్లాలో 18లక్షల ఎకరాల్లో పంటల సాగు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు అన్ని రకాల పంటలు కలిపి సుమారు 18లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. యాదాద్రి జిల్లాలో 3,88,382ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 4,21,380 ఎకరాలు, నల్లగొండలో 9,98,546 ఎకరాలు సాగయ్యాయి. ఇంకా వరి నాట్లు పడుతూనే ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో 2.58లక్షల మంది కూలీలు, సూర్యాపేటలో 5.77లక్షల మంది కూలీలు, నల్లగొండలో 7.60లక్షల మంది కూలీలు ఉన్నారు.

కూలీలకు పెరిగిన డిమాండ్

ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు వరి నాట్లు వేస్తున్నారు. ప్రస్తుతం వరినాట్లు, వరిలో, మెట్ట పంటల్లో కలుపు తీయడం, పత్తి తీత తదితర పనులకోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కూలీల కొరత ఏర్పడింది. రోజుకు కూలీకి రూ.500 నుంచి రూ.600 ఇస్తేనే పనులకు వచ్చే పరిస్థితి ఉంది. అలా ఇచ్చినా కూలీలు దొరక్కపోవడంతో రైతులు కొన్ని సందర్భాల్లో రవాణా చార్జీలు భరించి దూర ప్రాంతాల నుంచి కూలీలను తరలిస్తున్నారు.

50శాతం ఖర్చు భరించేలా అనుసంధానం చేయాలి

పొలం పనులకు అయ్యే ఖర్చులో 50శాతం రైతు భరించేలా, 50శాతం ఉపాధి హామీలో ప్రభుత్వం చెల్లించేలా వ్యవసాయానికి అనుసంధానం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఉపాధి హామీని అనసంధానం చేయడం వల్ల రైతులకు కొంత ఖర్చు కలిసి రావడంతో పాటు, కూలీలకు ఉపాధి కలుగుతుంది. వ్యవసాయానికి అనుసంధానిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానించాలి



ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించాలి. తమ పార్టీ, రైతులు చాలా కాలంగా ఈ డిమాండ్ చేస్తున్నారు. ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానిస్తే రైతులకు కూలీల కొరత తీరడంతో పాటు కొంత ఖర్చు కూడా ఆదా అవుతుంది. రైతులకు పంట గిట్టుబాటు ధర లభించడం లేనందున ఉపాధి అనుసంధానంతో కొంత మేలు జరుగుతుంది. ఉపాధి హామీలో చేస్తున్న పనుల్లో కొన్ని పెద్దగా ఉపయోగం లేనివి కూడా ఉన్నాయి. అలాంటి పనులు చేయించడానికి బదులు రైతుల పనులు చేసి వారికి తోడ్పాటునందిండం మంచిది.

- యానాల దామోదర్‌రెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, రైతు

50శాతం ఖర్చు ప్రభుత్వం చెల్లించాలి



ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ కూలీలకు అయ్యే ఖర్చులో 50శాతం రైతు భరించేలా, మరో 50శాతం ప్రభుత్వం చెల్లించేలా వ్యవసాయానికి అనుసంధానించాలి. ఉపాధి హామీని అనుసంధానిస్తే రైతులకు కూలీల కొరత తీరుతుంది. వ్యవసాయ పనులు సకాలంలో పూర్తవుతాయి.

- సోంమల్లు, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు, మోత్కూరు



11 ఏళ్లకు మోక్షం

- ఎట్టకేలకు మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు
- ఉమ్మడి జిల్లాలో 560 మంది ఉపాధ్యాయుల బదిలీ

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 14: నియామకమైన పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ కోసం మోడల్ స్కూల్ టీచర్లు 11 ఏళ్లల ఎదురుచూశారు. ఎట్టకేలకు వారి నిరీక్షణ ఫలించి ప్రభుత్వం బదిలీలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం 2013-14లో మోడల్ స్కూళ్లను ప్రారంభించింది. అప్పుడు నియామకమైన వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు నేటికీ బదిలీకి నోచుకోలేదు. సాధారణంగా ఎనిమిదేళ్లకు ఉపాధ్యాయుల బదిలీలు చేపడుతుంటారు. కానీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు మాత్రం 11 ఏళ్లుగా చేపట్టలేదు. దీంతో నియామకమైన పాఠశాలలోనే వారు ఇంతకాలం విధులు నిర్వహిస్తూ వచ్చారు. ఇది కొంత మంది ఉపాధ్యాయులకు ఉపయోగకరమైనా, మరికొంత మంది ఉపాధ్యాయులకు మాత్రం ఇబ్బందిగా మారింది.

బదిలీలు చేపట్టాలని మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు పలు మార్లు ప్రభుత్వానికి విన్నవించారు. ప్రభుత్వం బదిలీలు చేపట్టాలనే ఆలోచన చేసి వెబ్ ఆప్షన్లు ఇచ్చింది. ఆ తరువాత కొంతమంది ఉపాధ్యాయులు సీనియారిటీ, సర్వీస్ పాయింట్ల విషయంలో కోర్టును ఆశ్రయించారు. దీంతో బదిలీల ప్రక్రియకు బ్రేక్ పడింది. తాజాగా, కోర్టు బదిలీలు చేసుకోవచ్చని తీర్పురావడంతో ప్రభుత్వం వెంటనే బదిలీల ప్రక్రియను పూర్తి చేసింది.

ఉమ్మడి జిల్లాలో 33 మోడల్ స్కూళ్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 33 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో 9, నల్లగొండ జిల్లాలో 17, యాదాద్రి జిల్లాలో 7 పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో వివిధ సబ్జెక్టులకు సంబంధించి మొత్తం 560 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ వీరందరికీ బదిలీల ప్రక్రియను అధికారులు శనివారం పూర్తి చేశారు. దీంతో ఉపాధ్యాయులందరు బదిలీ అయిన పాఠశాలల్లో రిపోర్ట్ చేశారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



11 ఏళ్ల తరువాత మోడల్ స్కూల్ టీచర్లకు బదిలీలు నిర్వహించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. బదిలీల కోసం ఉపాధ్యాయులు ఎంతో ఆశగా ఇన్నేళ్లు ఎదురుచూశారు. ఎట్టకేలకు ఉపాధ్యాయుల నిరీక్షణ ఫలించింది. బదిలీల ప్రక్రియ ముగిసినందున పదోన్నతుల ప్రక్రియను కూడా చేపట్టాలి. మోడల్ స్కూల్ టీచర్లలో బదిలీల ప్రక్రియ ఆనందం కలిగింది.

- యాకమల్లు, తెలంగాణ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

మదర్ డెయిరీ చైర్మన్‌గా మధుసూదన్‌రెడ్డి ఏకగ్రీవం

హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



మంత్రి వెంకట్‌రెడ్డి నుంచి నియామకపు పత్రాలను అందుకుంటున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు

తుర్కపల్లి, సెప్టెంబరు 14: తుర్కపల్లి మండలం వేలుపల్లి గ్రామానికి చెందిన గుడిపాటి మధుసూదన్‌రెడ్డి నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (నార్ముల్) చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. శనివారం హయత్‌నగర్‌లోని మదర్ డెయిరీ కార్యాలయంలో ఉదయం 11గంటలకు ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్ ఎన్నికకోసం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన 15 మంది డైరెక్టర్లు హాజరయ్యారు. చైర్మన్ ఎన్నికకు ముందు నూతనంగా గెలుపొందిన డైరెక్టర్ల పదవీకాలాన్ని లాటరీ పద్ధతిన నిర్ణయించారు. డైరెక్టర్లు గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, అగ్రాల నర్సింహరెడ్డి, బత్తుల నరేందర్‌రెడ్డి పదవీకాలం ఐదేళ్లు, కల్లెపల్లి శ్రీశైలం, పుప్పాల నర్సింహులు, మండలి జంగయ్య పదవీ కాలం నాలుగేళ్లుగా లాటరీ ద్వారా నిర్ధారిచారు. చైర్మన్ పదవికోసం గుడిపాటి మధుసూదన్‌రెడ్డి ఒక్కరే నామినేషన్ వేయగా డైరెక్టర్ సురేందర్‌రెడ్డి బలపర్చగా మండలి జంగయ్య ఆమోదించడంతో చైర్మన్ ఎన్నిక పార్టీలకతీతంగా ఏకగ్రీవమైంది. నూతనంగా ఎన్నికైన పాలక వర్గం అక్టోబరు ఒకటో తేదీ నుంచి పదవీ బాధ్యతలు చేపడ్తారు. చైర్మన్ ఎన్నిక అనంతరం ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమారెడ్డి కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చైర్మన్, డైరెక్టర్లకు నియామకపు పత్రాలు అందజేసారు.

మదర్‌డైరీని లాభాల బాటలోకి తీసుకరావాలి

మదర్ డెయిరీని లాభాల బాటలోకి తీసుకరావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మదర్ డెయిరీ చైర్మన్ ఎన్నిక అనంతరం ఆయన మాట్లాడారు. పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లతోపాటు నార్మాక్స్ మాజీ చైర్మన్లు గుత్తా జితేందర్‌రెడ్డి, గంగుల కృష్ణారెడ్డి,యాదాద్రి భువనగిరి డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, నాయకులు గాల్‌రెడ్డి తదిరులు పాల్గొన్నారు.

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బీజేపీని ఆదరిస్తున్న తెలంగాణ ప్రజలు

- సభ్యత్వ నమోదుతో మరింత జోష్
- బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్

భువనగిరి టౌన్, సెప్టెంబరు 14: అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో ఎనిమిది మంది చొప్పున ఎమ్మెల్యేలు, ఎంపీలను, ఓ ఉపాధ్యాయ ఎమ్మెల్సీని గెలిపించడం ద్వారా తెలంగాణ ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారని పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి, కర్ణాటక ఎమ్మెల్యే అభయ్‌పాటిల్ అన్నారు. శనివారం భువనగిరిలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరుస్తుండటం, రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్న ప్రజల మనోగతాన్ని గౌరవిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత నాయకులదేనన్నారు. ఈ దిశగా రాష్ట్ర నాయకత్వంతో పాటు జిల్లా, స్థానిక నాయకులు ప్రజలతో మమేకమయ్యేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, విపక్ష బీఆర్ఎస్ విఫల రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, పాలనను విస్మరించి ఇరుపార్టీలు కూడా చౌకబారు ప్రచారానికి దిగజారాయని విమర్శించారు. సభ్యత్వ నమోదుపై నిర్లక్ష్యం చూపరాదని, లక్ష్యాన్ని చేరేలా అన్నిస్థాయిల నాయకులు కృషి చేయాలన్నారు. సభ్యత్వ నమోదు పూర్తయ్యే వరకూ రోజువారీగా పర్యవేక్షిస్తామని, సభ్యత్వ నమోదుతో పార్టీకి మరింత జోష్ రానుందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర సభ్యత్వ ప్రముఖ, మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రరావు, సభ్యుడు మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణ రెడ్డి, పడాల శ్రీనివాస్, జిల్లా సభ్యత్వ నమోదు ప్రముఖ్ చాడ శ్రీనివాస్‌రెడ్డి, చందా మహేందర్‌గుప్తా, ఊట్కూరి అశోక్‌గౌడ్, సుర్వి లావణ్య, రత్నపురం బలరాం తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా సాగర్ జలాశయం


సాగర్‌లో జలకళ


పూర్తిస్థాయికి నీటిమట్టం

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, సెప్టెంబరు 14: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. 50 రోజులుగా సాగర్‌కు ఎగువ నుంచి వరద వచ్చి చేరడంతో గత నెల 5వ తేదీ నుంచి క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం రెండు క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేయగా, వరద రాక పెరగడంతో శనివారం నాలుగు క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి 68,260 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతుంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 590అడుగులు (312.0450టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 3,667 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,029 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం 26 క్రస్ట్ గేట్లలో 4 క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి 23,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 77,496 నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 68,260 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరిన మూసీ


ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకుంది. 645అడుగుల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు అక్టోబరు, నవంబరు మాసాల్లో వచ్చే తుపాన్లు, ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కురిసే వర్షాలకు నిండడం, రబీలో ఆయకట్టుకు సాగునీటిని వదలడం ఆనవాయితీ. కాగా అందుకు భిన్నంగా నాలుగేళ్లుగా ఈ ప్రాజెక్టు వేసవిలోనే జలకళను సంతరించుకుంటూ వస్తోంది. ఈ ఏడాది సైతం వానాకాలానికి ముందే ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరింది. ఆ తర్వాత ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో క్రమం తప్పకుండా వస్తున్న ఇన్‌ఫ్లోతో ప్రాజెక్టు నీటి మట్టం ఒక్కో అడుగు చొప్పున పెరుగుతూ వచ్చి శనివారం సాయంత్రానికి 644.20అడుగులకు చేరింది. 4.46టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం ఉన్న మూసీ ప్రాజెక్టులో ప్రస్తుతం 4.24టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 1,155క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మరోవైపు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు సాగునీటి విడుదల కొనసాగుతోంది. కుడికాల్వకు 315.31క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 315.31క్యూసెక్కుల చొప్పున ఆయకట్టుకు రెండో విడతగా నీటిని విడుదల చేస్తున్నారు.

కొనసాగుతున్న నీటి ప్రవాహం

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు(45.77 టీఎంసీలు) కాగా, శనివారం సాయంత్రానికి 174.27 అడుగులు (44.64 టీఎంసీలు)గా నమోదైంది. కాగా ప్రాజెక్టుకు ఎగువ నుంచి 62,502 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, మూడు రేడియల్ క్రస్ట్ గేట్లు ఎత్తి 45,031 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 104 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు అవుట్‌ఫ్లో 61,031 క్యూసెక్కులుగా నమోదైంది.

ట్రాక్టర్ ట్రాలీలను
చోరీ చేసే నలుగురి అరెస్ట్

సూర్యాపేటక్రైం, సెప్టెంబరు 14: ట్రాక్టర్ల ట్రాలీలను చోరీ చేసే నలుగురిని సూర్యాపేట సీసీఎస్, మద్దిరాల పోలీసులు అరెస్టుచేశారు. వారి నుంచి సుమారు రూ.22.92లక్షల విలువ చేసే 19 ట్రాలీలను స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను శనివారం ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ జిల్లాకేంద్రంలో వెల్లడించారు. ఈ నెల 13వ తేదీన పోలీసులు మద్దిరాల క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, అదే సమయంలో కుంటపల్లి వైపునుంచి బైక్‌పై నల్లగొండ జిల్లా హాలియా మండలం మారేపల్లి గ్రామానికి చెందిన స్టోన్ కట్టర్ సంపంగి మహేష్, నకిరేకల్ మండలం గోరెంకలపల్లి గ్రామానికి చెందిన సంపంగి సత్యంతోపాటు వారి వెంట ట్రాక్టర్‌పై నల్లగొండ జిల్లా కనగల్ మండలం చర్లగౌరారం గ్రామానికి చెందిన స్టోన్ కట్టర్ ఓర్సు వెంకన్న, హాలియా మండలం మారేపల్లి గ్రామానికి చెందిన ఆలకుంట్ల మహేష్ వస్తున్నారు. వారిని ఆపి వాహనాల కాగితాలు చూపించమనగా కాగితాలు చూపించక పోగా వారి ప్రవర్తనపై అనుమానం కలిగింది. దీంతో నలుగురిని విచారించగా, జిల్లావ్యాప్తంగా 18 ట్రాక్టర్ ట్రాలీలను చోరీ చేసినట్లు అంగీకరించారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి విచారించినట్లు తెలిపారు. సమావేశంలో ఏఆర్‌అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ జి. రవి తదితరులు పాల్గొన్నారు.




అనంత ఆలోచనలు అద్భుత నిర్మాణాలు

- ఇంజనీర్ల మేధోశక్తికి నిదర్శనం నాగార్జునసాగర్
- కూలీలు, చేతిలో గీతలు చూసుకొని పనికి వచ్చేవాళ్లు
- వారానికి ఒక సారీ కూలీల డబ్బులు ఇచ్చే వాళ్లం : అజంఅలీఖాన్

నాగార్జునసాగర్, సెప్టెంబరు 14: మానవ మేధో వికాసానికి ప్రతీక, దేశ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానానికి అత్యుత్తమ కీర్తి చంద్రిక, శ్రమ శక్తిని రుజువు చేసిన కరదీపిక. దానిపేరే నాగార్జునసాగర్ ప్రాజెక్టు. రెండు తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణగా.. పచ్చని పైరుతో సింగారించి, తెలుగు మాగాణిని తీర్చిదిద్దిన అత్యద్భుత నిర్మాణ సౌధం ఇది. కరువు రక్కసి కబంధ హస్తాల నుంచి కర్షకులకు విముక్తి ప్రసాదించిన పవిత్ర మందిరం. అలాంటి కట్టడానికి ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా విజయవంతంగా పూర్తిచేసిన ఘనత భారత దేశ ఇంజనీర్ల ప్రతిభకు, ప్రజల శ్రమశక్తికి నిదర్శనం. ఇంతటి మహత్తర ప్రాజెక్టు నిర్మాణంలో ఎందరో భారతీయు ఇంజనీర్లు సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో పాలుపంచుకున్నారు. నేడు ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో పాలుపంచుకున్న దివంగత ఇంజనీర్ అజాం అలీఖాన్ బతికున్నపుడు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పిన విశేషాలు..

చేతిలో గీతలు చూసుకొని..

సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో 1960 నుంచి 1972 వరకు ఏఈఈగా పనిచేసిన అజాం అలీఖాన్ తన అనుభవాలను పంచుకున్నారు. ఆ కాలంలో కరెంటు లేకపోండంతో కూలీలు చేతిలో గీతలు కనిపిస్తే తెల్ల వారిందని తెలుసుకొని పనులకు వచ్చేవాళ్లన్నారు. అలాగే సాయంత్రం చేతిలో గీతలు కనిపించకుండా పోతే పని నుంచి ఇంటికి వెళ్లే వారు. అంతేకాకుండా వారానికి ఒకసారి కూలీలకు డబ్బులు పంచే వాళ్లని, ఆ డబ్బులు ఆ నాడు చిల్లర రూపంలో, అలాగే ఒక్క రూపాయి కాగితాలు బస్తాల్లో బ్యాంకు నుంచి తెచ్చి పంచేవారన్నారు. ఆ డబ్బులను శనివారం కూలీలకు పంచేవాళ్లమని తన అనుభవాలను అజాం అలీఖాన్ 'ఆంధ్రజ్యోతి'కి గత ఏడాది తెలిపారు. గత ఏడాది అనారోగ్యంతో అజాం అలీఖాన్ మృతి చెందారు. ఆయన చివరి కోరిక మేరకు తనను సాగర్‌లోనే ఖననం చేయాలని, కోరడంతో ఇక్కడే ఖననం చేశామని కుటుంబ సభ్యులు తెలిపారు.



సాగర్ నిర్మాణంలో పాలుపంచుకున్న ప్రముఖ ఇంజనీర్లు వీరే..

మొదట సర్వే చేసిన ఇంజనీరు: **అలీ నవాజ్ జంగ్**
మొదటి చీఫ్ ఇంజనీరు: **జాఫర్ అలీ**
పూర్తి చేసిన చీఫ్ ఇంజనీర్: **ఏపీ రంగనాథస్వామి, కేఎల్ రావు**

నాటి.. మేటి ఆదర్శం.. మేరెడ్డి

- కీలక పాత్ర పోషించి ఏఎమ్మార్పీ ప్రాజెక్టును పూర్తి చేయడంలో ఆయన పాత్ర కీలకం

దేవరకొండ: ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకొని నల్లగొండ జిల్లాలోని ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించేందుకు ఇంజనీర్‌గా ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రజాప్రతినిధులు, సహచర ఇంజనీర్ల సహకారంతో కీలకపాత్ర పోషించారు తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్లఫోరం రాష్ట్ర కార్యదర్శి మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం తిప్పర్తి గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన శ్యాంప్రసాద్‌రెడ్డి పలివెల గ్రామంలో ఒకటో తరగతి నుంచి 10 తరగతుల వరకు చదివి హైదరాబాద్‌లో ఇంటర్ నుంచి ఇంజనీర్ వరకు ఉన్నత చదువులు చదివారు. నీటిపారుదలశాఖలో ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించి 1997లో ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు ఏఈగా బాధ్యతలు చేపట్టారు. ఏఈఈగా, డీఈఈగా, ఈఈగా, ఏఎమ్మార్పీ, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఎస్ఎల్‌బీసీ సొరంగం, నక్కలగండి, పెండ్లిపాకల ప్రాజెక్టుల నిర్మాణంలో ఇంజనీర్‌గా పాత్ర కీలకం. జిల్లాలోని రెండు లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ జంటనగరాలతోపాటు జిల్లాలోని 516గ్రామాలకు తాగునీరు అందించే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో ఆయన పాత్ర కీలకమైంది. 1998లో ఏఎమ్మార్పీ, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు ప్రారంభమయ్యాయి. పుట్టంగండి నుంచి నాలుగు మోటర్ల ద్వారా ఏకేబీఆర్‌కు నీరు అందించడమే ఓ ప్రణాళిక. ఒక్కో మోటర్ 600 క్యూసెక్కులు కలిసి నాలుగు మోటర్లు కలిపి 2400 క్యూసెక్కుల నీటిని ఏకేబీఆర్‌లోకి విడుదల చేయడమే ప్రాజెక్టు లక్ష్యం. ఏకేబీఆర్, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కట్టను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించడంలో సహచర ఇంజనీర్లతోపాటు శ్యాంప్రసాద్‌రెడ్డి పాత్ర ప్రధానంగా ఉంది.



శ్యాంప్రసాద్‌రెడ్డి





2001లో ఏఎమ్మార్పీ మొదటి మోటర్ ట్రయల్‌రన్ విజయవంతం కావడంతో ఇంజనీర్లు, రైతులతో ఆనందాన్ని పంచుకుంటున్న శ్యాంప్రసాద్‌రెడ్డి

జిల్లాకు సాగునీరు అందించడంలో..

2001లో ఏఎమ్మార్పీ మొదటి మోటర్ ట్రయల్‌రన్ విజయవంతం కావడంతో ప్రజాప్రతినిధులు, సహచర ఇంజనీర్లు రైతులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. 2003లో ఏఎమ్మార్పీ మరో మూడు మోటర్లు ప్రారంభంకాగా మొత్తం నాలుగు మోటర్లు విజయవంతంకావడంతో జిల్లాకు సాగునీరందిస్తున్నారు. శ్రీశైలం సొరంగమార్గం తవ్వకం పనుల్లో ఇంజనీర్‌గా తన పాత్ర పోషించారు. పెండ్లిపాకల, నక్కలగండి రిజర్వాయర్ల నిర్మాణానికి కృషిచేశారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి అన్ని గ్రామాలకు కృష్ణాజలాలు సరఫరా చేయలన్నదే లక్ష్యంగా ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రజాప్రతినిధులు, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో సమన్వయంగా ఉండి కృషిచేశారు. తెలంగాణ ఇంజనీర్ల ఫోరం ఏర్పాటుచేసి ఇంజనీర్ల సమస్యను పరిష్కరించేలా కృషి చేశారు. జిల్లాలో ఉత్తమ ఇంజనీర్‌గా, రాష్ట్రస్థాయి ఉత్తమ ఇంజనీర్‌గా మంత్రులు, నీటిపారుదలశాఖ ఉన్నత అధికారులతో పలు పర్యాయాలు అవార్డులు అందుకున్నారు. 2007లో ఏఎమ్మార్పీ ఈఈగా ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరాన్ని ఏర్పాటుచేసి రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. పాలమూరు రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలతోపాటు తెలంగాణలోని ప్రాజెక్టుల నిర్మాణానికి, ప్రభుత్వానికి, నీటిపారుదల నిపుణులకు సలహాలు, సూచనలిస్తూ ముందుకు వెళుతున్నారు. డిండి ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇప్పటికి నీటిపారుదలశాఖకు సంబంధించిన సలహాలు, సూచనలు ఇస్తు ముందుకు వెళుతున్నారు.

ఎస్‌వో, ఏఎన్ఎంకు నోటీసులు: ఇన్‌చార్జి డీఈవో



మద్దిరాలలోని కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈవో శ్రవణ్‌కుమార్

మద్దిరాల, సెప్టెంబరు 14 : సూర్యాపేట జిల్లా మద్దిరాల కస్తూర్బా పాఠశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటనలో ఎస్‌వో, ఏఎన్ఎంలకు నోటీసులు జారీ చేసినట్లు ఇన్‌చార్జి డీఈవో శ్రవణ్‌కుమార్ తెలిపారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం విద్యాధికారులు విచారణ చేపట్టారు. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన బీసు మురళీ కుమార్తె గీతిక కేజీబీవీలో ఆరో తరగతి విద్యనభ్యసిస్తోంది. వారం రోజుల కిందట గీతకకు కిడ్నీలో రాళ్లు ఉండటంతో నొప్పి రావడంతో వాంతులు చేసుకుంది. ఎవరికీ రాని వాంతులు నీకెందుకు వస్తున్నాయని ఏఎన్ఎం వెంకటమ్మ విద్యార్థిని గీతకను మందలించినట్లు విద్యార్థినులు అధికారులకు తెలిపారు. మనస్తాపానికి గురైన గీతిక శుక్రవారం తెల్లవారుజామున ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. ఎస్‌వో తేజశ్రీ సైతం విద్యార్థిని పట్టించుకోకుండా ఏఎన్ఎంకు సహకరించిందని విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఇన్‌చార్జి డీఈవో తెలిపారు. ఎస్‌వో, ఏఎన్ఎంలకు నోటీసులు అందజేశామన్నారు. విద్యార్థినులకు బోధన చేయాలే తప్ప అసభ్యంగా ప్రవర్తించకూడదన్నారు. కార్యక్రమంలో జీఈసీవో పూలన్, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఆర్ఐ వహిద్దీన్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అండగా ఉంటా: డీసీసీ అధ్యక్షుడు వెంకన్నయాదవ్

గాయాలై చికిత్స పొందుతున్న విద్యార్థిని గీతికకు అండగా ఉంటానని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ అన్నారు. సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని గీతికను శనివారం పరామర్శించి, మాట్లాడారు. విద్యార్థినులను వేధించకూడదన్నారు. అధికారులు విద్యార్థినుల బాగోగులను చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గుడ్ల వెంకన్న, రేతినేని శ్రీను, కోడి కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎడమ కాల్వ గండి పూడ్చివేత పనులు ప్రారంభం





గండ్లు పడిన చోట కాల్వకట్ట కుడివైపున కంపచెట్లు తొలగిస్తున్న యంత్రాలు, కొనసాగుతున్న మరమ్మతు పనులు

నడిగూడెం, సెప్టెంబరు 14 : సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద నాగార్జునసాగర్ ఎడమకాల్వకు పడిన గండ్ల పూడ్చివేత పనులు శనివారం మొదలయ్యాయి. ఆగస్టు చివరి, సెప్టెంబరు మొదటివారంలో కురిసిన భారీ వర్షాలకు ఎడమకాల్వకు రెండుచోట్ల గండిపడిన విషయం తెలిసిందే. ప్రభుత్వ గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చేందుకు ఈ నెల 5న రూ.2.10 కోట్లు విడుదల చేసింది. అయితే పాలేరు నుంచి బ్యాక్‌వాటర్ వస్తుండటంతో పనుల్లో జాప్యం జరిగింది. మంగళవారం నుంచి పాలేరు బ్యాక్‌వాటర్ నిలిపివేయడంతో పాటు వానలు నిలిచిపోవడంతో గండ్ల పూడ్చివేత పనులు ప్రారంభించారు. కాల్వకట్టపై కంపచెట్లు తొలగించి గుంతలు పూడ్చి వాహనాల రాకపోకలు జరిగేలా మరమ్మతులు చేపడుతున్నారు. కాల్వ ఎడమవైపు గండ్లు పడగా కుడివైపు కాల్వ కట్టను బాగుచేసి కాల్వలోకి భారీ వాహనాల సామాగ్రి రవాణా చేసేందుకు ర్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేసి ఎడమకాల్వ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

మరమ్మతు పనులను పరిశీలించనున్న మంత్రి ఉత్తమ్

నడిగూడెం / హుజూర్‌నగర్ : కాగితరామచంద్రాపూరం వద్ద గండ్ల పూడ్చివేత పనులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం పరిశీలించనున్నారు. పనులు జరుగుతున్న తీరును, ఇబ్బందులను తెలుసుకుని ప్రభుత్వపరంగా అధికారులకు పలు సూచనలు చేయనున్నట్లు సమాచారం. అనంతరం రెడ్లకుంట మేజర్ గండి మరమ్మతుల పరిశీలన చేయనున్నారు. దాంతో పాటు కరక్కాయలగూడెంలో పరిధిలోని 14వ కిలో మీటర్ వద్ద ఎడమ కాల్వకు పడిన గండి ప్రదేశాన్ని పరిశీలించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12గంటలకు ముత్యాలమ్మ జాతర సందర్భంగా పోచమ్మతల్లిని దర్శించుకోనున్నారు. మంత్రి ఉత్తమ్‌తో పాటు పద్మావతిరెడ్డి కూడా హాజరు కానున్నారు. అనంతరం మఠంపల్లి మండలంలోని చెరువులను, అదే మండలంలోని చౌటపల్లి చెరువును పరిశీలించి అక్కడి నుంచి హెలికాప్టర్‌లో తిరిగి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. ఉత్తమ్ వెంట కలెక్టర్, నీటిపారుదల, రెవెన్యూ అధికారులు హాజరుకానున్నారు. జాతర సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కు స్వాగత ఏర్పాట్లుచేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణంలో పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు.

నియామకాల్లో అక్రమాలు నిరాధారం

హుజూర్‌నగర్, సెప్టెంబరు 14 : సూర్యాపేట హుజూర్‌నగర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలపై కొంతమంది వ్యక్తులు నిరాధార ఆరోపణలు చేశారని మైనార్టీ గురుకుల జిల్లా విద్యాధికారి కె.జగదీశ్వరరెడ్డి అన్నారు. పాఠశాలలో 9మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను జిల్లా స్థాయిలో ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ ఎంపిక చేసింది. ఈ నియామకాలపై అవినీతి, అక్రమాలు, ఆరోపణలు విమర్శలు రావడంతో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు శనివారం మైనార్టీ గురుకుల జిల్లా విద్యాధికారి విచారణ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు నిరాధార ఆరోపణలు చేశారని, సోషల్‌మీడియాలో వచ్చిన ఆరోపణలు అవాస్తవమన్నారు. పాఠశాల ప్రతిష్ఠను దెబ్బతీసేలా విమర్శలు చేశారన్నారు. గతంలో పాఠశాలలో పనిచేసి మానేసిన కొంతమంది అనవసరమైన ఆరోపణలు చేశారన్నారు. విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. పాఠశాలలో నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, ప్రభుత్వం అందిస్తున్న మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. పాఠశాలలో ఎలాంటి పొరపాట్లు జరిగినా సహించబోమన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోమన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెహనాబేగం, ఉమ్మ జిల్లా గురుకుల పాఠశాలల అకడమిక్ కోఆర్డినేటర్ డీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు ఉచిత కృత్రిమ గర్భధారణ సేవలు

కోదాడ రూరల్, సెప్టెంబరు 14 : సూర్యాపేట జిల్లా కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో నేటి నుంచి పశువులకి ఉచిత కృత్రిమ గర్భాధారణ సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ పీ పెంటయ్య శనివారం తెలిపారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒక మహత్తర కార్యక్రమం దేశవ్యాప్త కృత్రిమ గర్భాధారణ కార్యక్రమమన్నారు. దేశవ్యాప్తంగా 113 జిల్లాల్లో రెండో విడత ప్రారంభమైందన్నారు. సూర్యాపేట జిల్లాలో 100 గ్రామాల్లోని 50 వేల పశువులకి ఉచిత గర్భాధారణ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం వినియోగించుకోవడానికి పశుపోషకుల పశువుల చెవులకి పన్నెండు అంకెలు గల గుర్తింపు సంఖ్య చెవిపోగులు ఉండాలన్నారు. అవి భారత్ పశుదాన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి ఉండాలన్నారు. చెవిపోగులు వేయించుకోని వారు, ఇదివరకు వేసినవి ఊడిపోయిన వారు తిరిగి చెవిపోగులు వేయించి, గేదె ఫొటోతో సహా భారత్ పశుదాన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయించాలన్నారు. రైతులు తమ పశువులు ఎదకు వచ్చినప్పుడు పశువైద్యాధికారిని సంప్రదిస్తే వారి ఇంటి వద్దకే కృత్రిమ గర్భాధారణ టెక్నీషియన్‌ను పంపించి పశువులకి కృత్రిమ గర్భాధారణ చేస్తామన్నారు.

యాదాద్రీశుడికి ఏకాదశి పూజలు



లక్ష్మీనృసింహులకు లక్షపుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 14: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తులను వివిధ పుష్ప మాలికలు పట్టు వస్త్రాలు, బంగారు, వజ్ర వైడూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చక స్వాములు ప్రత్యేక వేదికపై అదిష్ఠింపజేశారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామ పఠనాలు, కమలం పూలతో పాటు వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టగా పంచరాత్రాగమ రీతిలో గంటపాటు కొనసాగింది. ప్రధానార్చకులు లక్ష్మీనరసింహాచార్యులు మంత్రపఠనం చేయగా ఆలయ ఈవో భాస్కర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. కాగా స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వివిధ శాఖల ద్వారా రూ.28,56,662 ఆదాయం సమకూర్చినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

గిరిప్రదక్షిణ మార్గంలో మండపాల నిర్మాణాలు

కొండచుకట్టూ ఉన్న గిరి ప్రదక్షిణ రోడ్డు మార్గంలో మండపాల నిర్మాణాలు మొదలయ్యాయి. కొండపడమటి దిక్కులో యాదమహర్షి మండపాన్ని నిర్మించేందుకు రూ.6.83కోట్లు అదే విధంగా కొండకు ఉత్తర దిక్కులో వ్రత మండపం వెనకాల మహా భక్తుడు ప్రహ్లాద మండపం నిర్మించేందుకు రూ.7.04 కోట్లు నిధులు కేటాయించారు. ఈ మేరకు 2024 జూలై 7న టెండర్లు ఆహ్వానించగా ఈ మండపాలు 10/10 విస్తీర్ణంతో నిర్మాణాలు జరుగుతున్నాయి. కొండకింద వ్రత మండపం వద్ద ప్రసాద విక్రయాల కౌంటర్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు. కొండపైన ఆలయ పునర్‌నిర్మాణం అనంతరం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కంటైనర్‌ను కొండకింద వ్రత మండపం వద్దకు తరలించారు. ప్రస్తుతం అది నిరుపయోగంగా ఉండడం చేత తిరిగి ప్రసాదాల విక్రయాలను కొనసాగిస్తే వ్రతాలు చేపట్టే భక్తులకు ప్రసాదాలు అందుబాటులోకి వస్తాయని స్థానికులు కోరుతున్నారు.



కొనసాగుతున్న యాదమహర్షి మండపం పనులు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

వలిగొండ, సెప్టెంబర్ 14: ప్రైవేట్ ఫైనాన్స్ వేధింపులు తట్టుకోలేక మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. ఎస్ఐ యుగేందర్ తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన రూపని సత్తయ్య (56) హార్వెస్టర్ నడుపుతూ కుటుండబాన్ని పోషిస్తున్నాడు. శ్రీరామ్ ఫైనాన్స్ నుంచి జాన్‌డీర్ హార్వెస్టర్‌పై రుణం తీసుకున్నాడు. అతని హార్వెస్టర్ సరిగ్గా పనిచేయకపోవడంలో సకాలంలో వాయిదాలు చెల్లించలేకపోయాడు. శ్రీరాం ఫైనాన్స్ మోత్కుర్ బ్రాంచ్ కలెక్షన్ ఎజెంట్ల్ మృతుని వేధించి హార్వెస్టర్ స్వాధీనం చేసుకున్నారు. దీంతో సత్తయ్య తీవ్ర మనస్థాపనిక గురై ఈనెల 12వ తేదీన పొలంలో వాడే గడ్డిమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అది గమనించిన కుటంబసభ్యులు వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. సత్తయ్య కుమారుడు సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసునట్లు ఎస్ఐ తెలిపారు. 2 లక్షల 70 వేలు బాకీ ఉన్నట్లు తెలిసింది. సత్తయ్యకు భార్య, వివాహితులైన ఇద్దరు కుమార్తెలు, అవివాహితులైన కుమార్తె, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

వినాయక నిమజ్జనానికి వెళ్లి వస్తూ

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 14: వినాయక నిమజ్జనానికి వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. సీఐ మన్మథరావు తెలిపిన వివారం ప్రకారం.. మండల పరిధిలోని లింగోజిగూడెం గ్రామానికి చెందిన భైరం వెంకన్న(23) శుక్రవారం రాత్రి వినాయక నిమజ్జన శోభయాత్రలో పాల్గొని బైక్‌పై గ్రామానికి వస్తుండగా రాత్రి 2 గంటల సమయంలో వలిగొండ రోడ్డు క్రాస్ రోడ్డు వద్ద బైక్‌ను కారు ఢీకొట్టింది. తీవ్ర గాయలకు గురైన వెంకన్నను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తండ్రి సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం .. కేసు నమోదు

భువనగిరి రూరల్, సెప్టెంబరు 14: లారీ డ్రైవర్‌గా పని చేస్తూ రోజూ మాదిరిగా ఇంట్లోంచి వెళ్లిన భర్త ఆరు రోజులు గడిచినా ఇంటికి రాకపోవడంతో అతని భార్య అంబటి మున్ని భువనగిరి రూరల్ పోలీసు స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా పడిగాల మండలం నుచ్చుమర్రి గ్రామానికి చెందిన అంబటి చిన్నస్వాములు ఐదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి భువనగిరి మునిసిపాలిటీ పరిధిలోని రాయిగిరిలో నివాసం ఉంటున్నాడు. కాగా ఈనెల 8న ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు లారీపైన డ్రైవింగ్ చేసేందుకు వెళుతున్నాని చెప్పి ఇంటికి తిరిగి రాలేదు. అతని ఫోన్ స్విచ్ ఆఫ్ అయి ఉండడం, ఆచూకీ కోసం ఆమె సమీప బంధువులు, స్నేహితుల ఇంట్లో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో భయభ్రాంతులకు గురైన ఆమె శనివారం భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

విద్యుద్ఘాతంతో పాడి ఆవు మృతి

వలిగొండ, సెప్టెంబర్ 14: ప్రమాదవశాత్తు విద్యుత్‌ఘాతనికి గురై పాడి ఆవు మృతి చెందింది. శనివారం మండలంలోని సుంకిశాల గ్రామానికి చెందిన రైతు మంగ శ్రీను పాడి ఆవు ఆ గ్రామ చివరన మేత కోసం వెళ్లగా ప్రమాదవశాత్తు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకుని అక్కడికక్కడే మృతి చెందింది. పాడిఆవు విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని, ఆదుకోవాలని బాధితుడు ప్రభుత్వాన్ని కోరాడు.

సందర్శనీయ స్థలం బుద్ధవనం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. సృజన

నాగార్జునసాగర్, సెప్టెంబరు 14: బౌద్ధ సందర్శన ప్రదేశాల్లో బుద్ధవనం ప్రప్రథమంగా ఉంటుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సృజన అన్నారు. నాగార్జునసాగర్‌ను శనివారం ఆమె కుటుంబ సమేతంగా సందర్శించారు. విజయవిహార్ అతిథి గృహానికి చేరుకున్న న్యాయమూర్తి దంపతులకు నిడమనూరు కోర్టు న్యాయమూర్తి అపూర్వ రవళి స్వాగతం పలికారు. అనంతరం నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్, ప్రధాన జల విద్యుత్ కేంద్రం, ఎత్తిపోతల జలపాతాన్ని వీక్షించారు. అనంతరం బుద్ధవనం చేరుకుని బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం మహాస్థూపాన్ని, బుద్ధ చరితవనంను సందర్శించారు. శాంతికి ప్రతిరూపంగా గౌతమబుద్ధుడు ఉంటారన్నారు. ధ్యాన ముద్రలో కనిపించే బుద్ధుడిని చూస్తుంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. బుద్ధుడి విశేశాలు బౌద్ధవనం ప్రపంచంలో ఎక్కడా కూడా లభించవని కేవలం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో ఉండటం గొప్ప అవకాశమన్నారు. బుద్ధవనంలో బుద్ధుడికి సంబంధించిన ఇంతటి విశేషాలు అందుబాటులో ఉండడం ప్రపంచదేశాల్లో భారతదేశంలోని తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం విశేషాలను వివరించారు. ఆమె వెంట నిడమనూరు కోర్టు సూపరింటెండెంట్ చంద్రశేఖరశర్మ, ఎస్ఐ సంపత్‌గౌడ్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న హైకోర్టు నాయయమూర్తి సృజన

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

నిడమనూరు, సెప్టెంబరు 14: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా నిడమనూరు గ్రామానికి చెందిన దండగల భీమయ్య(55) ఈ నెల 9న నిడమనూరులో రోడ్డు దాటుతుండగా మిర్యాలగూడ నుంచి హాలియా వైపు సిమెంట్ లోడుతో వెళుతున్న డీసీఎం వాహనం ఢీకొనగా భీమయ్య తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే 108 అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా భీమయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం ఉదయం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. భీమయ్య సోదరుడు దండగల సత్యమయ్య ఫిర్యాదు మేరకు సూర్యాపేట జిల్లా పాలకీడు మండలంలోని మహంకాళిగూడెం గ్రామానికి చెందిన డీసీఎం వాహనం డ్రైవర్ గంజి రాముపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదుపుతప్పి వాహనాన్ని ఢీకొని..

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 14: రోడ్డు పక్కన ఆగి ఉన్న టిప్పర్ వాహనాన్ని గమనించకుండా ఢీకొనడంతో అంబులెన్స్ డ్రైవర్ మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం మండలంలోని కిష్టాపురం గ్రామం వద్ద అద్దంకి - నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని నిజాంపేటకు చెందిన సునీత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. నెల్లూరుకు చెందిన తమ సమీప బంధువు సుబ్బమ్మ ఇంటికి వెళ్లి తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో సునీతకు మెరుగైన వైద్యం చేయించేందుకు నెల్లూరు పట్టణం నుంచి ప్రైవేట్ అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. మార్గమధ్యలో కొత్తగూడెం వద్ద అద్దంకి-నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా నిలిపి ఉన్న టిప్పర్ వాహనాన్ని అంబులెన్స్ డ్రైవర్ గమనించలేదు. అంబులెన్స్ అదుపుతప్పి టిప్పర్ వాహనాన్ని వెనుక ఢీకొనడంతో డ్రైవర్ రాకేష్(24) అంబులెన్స్ క్యాబిన్‌లో ఇరుకుని తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అంబులెన్స్‌లో ఉన్న రోగి సునీత, సుబ్బమ్మ, టెక్నీషియన్ సునీల్, కేర్ టేకర్ శివకుమార్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. అంబులెన్స్ డ్రైవర్ రాకేష్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తిచేసి బంధువులకు అప్పగించారు. కుటుంబ పోషణకు పెద్దదిక్కుగా ఉన్న రాకేష్ అకాల మృతిని జీర్ణించుకోలేక భార్య యశస్విని, తల్లి పుష్పలత కన్నీటి పర్యంతమయ్యారు. రాకేష్ తల్లి పుష్పలత ఫిర్యాదు మేరకు టిప్పర్ వాహన డ్రైవర్ మనుపాషాపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్ఐ రాములునాయక్ తెలిపారు.



ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిన్న అంబులెన్స్, రాకేష్ (ఫైల్)

కొనసాగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 14: గణేష్ నవరాత్రి ఉత్సవాలు భువనగిరిలో భక్తి శ్రద్ధల నడుమ కొనసాగుతున్నాయి. పట్టణంలో ప్రతిష్ఠించిన వందకు పైగా మండపాలలో రోజువారిగా నిత్యపూజలు, భజనలు నిర్వహిస్తుండగా శనివారం పట్టణంలోని అన్ని మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పలు మండపాలను సందర్శించి పూజ లు చేశారు. మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : వినాయక నవరాత్రి ఉత్సవాలతో ప్రజలలో ఐక్యత భావం పెంపొందుతుందని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణంలోని విద్యానగర్ కాలనీలో శనివారం రాణి రుద్రమ దేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద హోమం, కుంకుమార్చన, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కౌన్సిలర్లు పి.శ్రీధర్‌బాబు, తాడూరు శిరీషా, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మండల అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్యారాణి పోలోజు లతాశ్రీనివాస్, ఎం.నీరజ, బి.సంధ్య, ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ శ్వేతా ప్రియాక, ట్రీనిటీ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ వై.మంజుల, చైర్మన్ కృష్ణారావు పాల్గొన్నారు. తంగడపల్లిలో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చన నిర్వహించారు.

ఆత్మకూరు(ఎం)/ సంస్థాన్ నారాయణపురం: ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంతో పాటు సర్వేపల్లి, పల్లెపహడ్, మొరిపిరాల, పల్లెర్ల, కూరెళ్ల, పారుపల్లి గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నారాయణపురంలో యువజన సమాఖ్య ఆధ్వర్యంలో చేసిన గణేష్ మండపంలో అన్నదాన కార్యక్రమాన్ని ఎస్సై జగన్ ప్రారంభించారు.



భువనగిరిలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి



తంగడపల్లిలోని వివేకానంద యూత్ మండపంలో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు



చౌటుప్పల్‌లో పూజలో పాల్గొన్న మునిసిపల్ చైర్మన్ రాజు దంపతులు



ఆత్మకూరు(ఎం)లో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఏచూరి మరణం దేశ రాజకీయాలకు లోటు



భువనగిరి: ఏచూరి సంతాప సభలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి టౌన్/ రామన్నపే, సెప్టెంబరు 14: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం భారత రాజకీయాలకు తీరని లోటని మునసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు గోదా శ్రీరాములు, ఎండీ.జహంగీర్, రాచకొండ జనార్దన్ అన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన ఏచూరి సంతాప సభలో వారు మాట్లాడారు. భారతదేశ రాజకీయాలను గాడిలో పెట్టడంలో, వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమాలకు దిశానిర్దేశం చేయడంలో ఆయన పాత్ర గొప్పదని అన్నారు. ఎమర్జెన్సీ ప్రజా వ్యతిరేక ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారన్నారు. సంకీర్ణ ప్రభుత్వాల్లో పలు సంస్కరణలు, నూతన పథకాల అమలుకు ఆయన విశేష కృషి చేశారన్నారు. నేటితరం నాయకులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సమావేశంలో మునసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, నాయకులు బట్టు రామచంద్రయ్య, మంగ నర్సింహులు, మాటూరి బాలరాజు, ఏశాల అశోక్, చెక్క వెంకటేష్, కల్లూరి మల్లేశం, దేవరకొండ నర్సింహాచారి, దయ్యాల నర్సింహ, మాయ కృష్ణ, మద్దెల రాజయ్య, సిర్పంగి స్వామి, మద్దెపురం రాజు, ముక్కెర్ల యాదయ్య, గడ్డం వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

● సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి దేశానికి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల అశోక్‌రెడ్డి అన్నారు. రామన్నపేట మండలం సిరిపురంలో నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. నాయకులు బొల్గూరి అంజయ్య, బడుగు రమేష్, అంబటి మల్లారెడ్డి, సురేందర్‌రెడ్డి, భాస్కర్, ప్రభాకర్, సంతోష్‌రెడ్డి, సైదులు, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ వెంటనే చేపట్టాలి: జీఎంపీఎస్



సమావేశంలో మాట్లాడుతున్న మద్దెపురం రాజు

భువనగిరి రూరల్, సెప్టెంబరు 14: గొర్రెల పంపిణీని ప్రారంభించి అందుకు అవసరమైన నిధులు విడుదల చేసి, లబ్ధిదారులకు నగదు బదిలీ ద్వారా వెంటనే చేపట్టాలని గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి మద్దెపు రం రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భువనగిరిలో నిర్వహించిన జీఎంపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు గొర్రెల పంపిణీ పథకాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రకటించి అధికారంలోకి వచ్చి 10నెలలు దాటినా, అమలు చేయకపోవడం సరికాదన్నారు. జిల్లాలో మొదటి విడత 18,655 యూనిట్లు పంపిణీ చేసిందని, 15390మందికి రెండో విడత గొర్రెలు రావాల్సి ఉండగా 3134 మంది లబ్ధిదారులు రూ.43, 750 చొప్పున కలెక్టర్ ఖాతాలో జమ చేయగా కేవలం 2790 యూనిట్లు మాత్రమే పంపిణీ చేశారన్నారు. ఇంకను 347మంది తమ వంతు వాటా ధనం కలెక్టర్ ఖాతాలో జమ చేసి నెలలు తరబడిగా ఎదురు చూ సి 236మంది లబ్ధిదారులు తమ డీడీలను వాపస్ తీసుకున్నారన్నారు. వృత్తిరీత్యా ప్రమాదాల్లో చని పోయిన గొర్రెల మేకల పెంపకం దారులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, 50సంవత్సరాలు దాటి న వారికి నెలకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని డిమాం డ్ చేశారు. సమావేశంలో జిల్లా మండల నేతలు దయ్యాల నర్సింహ, మద్దెపురం బాలనర్సింహ, ఎల్లెంల సత్యనారాయణ, పాక జహంగీర్, తెల్జూరి మల్లేశ్, రాజలింగం, యాదగిరి పాల్గొన్నారు.

మదర్ డెయిరీ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు(ఎం), సెప్టెంబరు 14: నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల మదర్ డెయిరీ చైర్మన్‌గా ఎన్నికైన గుడిపాటి మధుసూదన్‌రెడ్డికి ఆత్మకూరు(ఎం) మండల కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ ముద్దసాని సిద్దయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బత్తిని ఉప్పలయ్య శనివారం హైద్రాబాద్‌లో కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

బాలకృష్ణారెడ్డి ఆశయాలను సాధించాలి

భువనగిరి టౌన్/భువనగిరి రూరల్, సెప్టెంబరు 14: తెలంగాణ మలిదశ ఉద్యమ కారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి ఆశయాలను సాధించాలని పలువురు బీఆర్ఎస్ నాయకులు అన్నారు. జిట్టా బాలకృష్ణారెడ్డికి నివాళిగా శనివారం రాత్రి జిల్లా కేంద్రం భువనగిరిలో ఆయన అభిమానులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్‌లోని సాయిబాబా ఆలయం నుంచి అమరవీరుల స్మారక స్తూపం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది. తెలంగాణ సాధనకు ఆయన చేసిన కృషిని, త్యాగాలను గుర్తు చేస్తూ నివాళులు అర్పించారు. మునిసిపల్ మాజీ చైర్మన్లు బర్రె జహంగీర్, ఎనబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్ష కార్యదర్శులు ఏవి కిరణ్‌కు మార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, జనగాం పాండు, కౌన్సిలర్లు ఎండీ.అ జీమ్, గోమారి సుధాకర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు తంగెళ్లపల్లి రవికుమార్, ఎస్‌కే.అమీద్‌పాషా, కస్తూరి పాండు పాల్గొన్నారు.



భువనగిరిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న జిట్టా అభిమానులు

నేడు జిట్టా సంస్మరణ సభ..కేటీఆర్ రాక

తెలంగాణ ఉద్యమ నేత బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి సంస్మరణ సభను ఆదివారం భువనగిరిలో నిర్వహిస్తున్నారు. స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 11.30గంటలకు నిర్వహిస్తున్న సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌తో సహా పలు పార్టీలకు చెందిన నాయకులు, ఉద్యమకారులు రానున్నారు. సభకు జిట్టా అభిమానులందరూ తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కోరారు.



గౌసుకొండలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న అభిమానులు

● భువనగిరి మండలం తాజ్‌పూర్‌లో జిట్టా అభిమానులు, బీఆర్ఎస్ నేతలు కొవ్వొత్తులు ప్రదర్శించి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన ఫ్లెక్సీ వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నేత డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, ఓరుగంటి రమేశ్, సుగుణాకర్ పాల్గొన్నారు.

వలిగొండ: యాదాద్రి భువనగిరి జిల్లాకు జిట్టా బాలకృష్ణారెడ్డి పేరు పెట్టాలని యువజన సంఘం నాయకులు వంశీ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడారు.

భూదాన్‌పోచంపల్లి : జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ మండలంలోని గౌసుకొండ గ్రామంలో ఆయన అభిమానులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు వాకిటి బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మునుకుంట్ల నరేష్, నేతాజీ యూత్ అధ్యక్షుడు గుర్రం శ్రీధర్‌రెడ్డి, వంగూరి స్వామి, స్థానిక నాయకులు నాంపల్లి రవీందర్‌రెడ్డి, పక్కీరు దేవేందర్‌రెడ్డి, నోముల శ్రీనివాస్‌రెడ్డి, గొంగిడి వెంకట్‌రెడ్డి, వాకిటి జంగారెడ్డి, మర్రి బుచ్చిరెడ్డి, గుర్రం బాల్‌రెడ్డి, మద్ది యశ్వంత్‌రెడ్డి, అంజయ్య, రవి, మల్లేష్ ఉన్నారు.

అప్రమత్తంగా లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 14: పాఠశాల మత్తు పదార్థాలకు నిలయంగా మారినా..అప్రమత్తంగా లేని చౌటుప్పల్ పట్టణంలోని ఒక ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దిండు భాస్కర్, మండల అధ్యక్షుడు పబ్బు వంశీ డిమాండ్ చేశారు. తరగతి గదుల్లోకి కొంత మంది విద్యార్థులు మత్తు పదార్థాలను తీసుకువస్తూ తోటి విద్యార్థులను చెడు వ్యసనాలకు బానిసలుగా మార్చేందుకు జరుగుతున్న కుట్రను వ్యతిరేకిస్తూ శనివారం బీజేవైఎం ఆధ్వర్యంలో ఒక ప్రైవేట్ స్కూల్ లోని ఆఫీస్ కార్యాలయం ఎదుట కార్యకర్తలు ప్ల కార్డులు పట్టుకొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాల విషయంపై యాజమాన్యానికి తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు విద్యా బుద్ధులను నేర్పించవలసిన ఉపాధ్యాయులు తరగతి గదుల్లోకి మత్తు పదార్థాలను తీసుకువస్తున్నా నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమని, విద్యార్థుల భవిష్యత్‌తో యాజమాన్యం చెలగాటమాడుతోందని వారు అన్నారు. స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని, మత్తు పదార్థాలకు బాధ్యులైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బీజేవైఎం నాయకులు మునగాల రాజశేఖర్ రెడ్డి, బాతరాజు వెంకటేశ్, వినయ్‌రెడ్డి, నరేష్, పందుల శరత్, వినయ్, శివ, మల్లారెడ్డి, పవన్. సంతోష్, నాగరాజ్, సాయి సంతోష్, ఓం శివ పాల్గొన్నారు. అనంతరం బీజేవైఎం కార్యకర్తలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా ఈ విషయమై తల్లి దండ్రులు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీజేవైఎం నాయకులు

డీజేలకు అనుమతి లేదు: సీఐ

రామన్నపేట, సెప్టెంబరు 14: గణేష్ నవరాత్రి వేడుకలు, నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదని రామనసపేట సీఐ పి.మల్లయ్య అన్నారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా ఉత్సవాలను నిర్వహించాలని, ఆటంకం కలిగించే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిమజ్జనం రోజున ఎలాంటి అపశృతి జరుగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మోత్కూరు : గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా నిర్వాహకులు తమ సూచనలు పాటించాలని, లేని పక్షంలో చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని మోత్కూరు ఎస్ఐ డి.నాగరాజు హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోత్కూరు మునిసిపాలిటీలో 53 విగ్రహాలు, మండలంలో 63 విగ్రహాలు ప్రతిష్ఠించారన్నారు. గణేష్ శోభాయాత్రలో డీజే సౌండ్ బాక్స్‌లు ఉపయోగించవద్దన్నారు. అశ్లీల నృత్యాలు, మత విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదన్నారు. విగ్రహాలకు విద్యుత్ తీగలు తగలకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాణసంచా కాల్చకూడదన్నార శోభాయాత్రలో, నీటిలో నిమజ్జనం చేస్తున్న సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

బీబీనగర్: వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జనాలకోసం బీబీనగర్ చెరువులో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం రోజుతో నవరాత్రులు ముగుస్తున్న సందర్భంగా అదే రోజు అత్యధికంగా గణేష్ విగ్రహాలను నిర్వాహకులు భారీ శోభయాత్రల ద్వారా నిమజ్జనం చేయనున్నారు. దీంతో చెరువు వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రమాదాల బారిన పడకుండా రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. నిమజ్జనాలకోసం భారీ క్రేన్లను అందుబాటులో ఉంచనున్నట్లు తహసీల్దార్ శ్రీధర్ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం) సెప్టెంబర్ 14: మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన వృద్ధుడు దుంప ఎల్లయ్య అనారోగ్యంతో ఆరు రోజుల క్రితం మృతి చెందాడు. బాధజిత కుటుంబసభ్యులకు కనీసం ఉండటానికి ఇల్లు కూడా లేక అద్దె ఇంట్లో ఉంటున్నారు. కడు పేద కుటుంబ కావడంతో ఈ విషయాన్ని వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయగా స్పందించిన దాతలు తమకు తోచిన విధంగా చేసిన సహాయం రూ.60 వేలు అయ్యింది. ఈ సహాయాన్ని శనివారం మృతుని భార్య సత్తమ్మకు అందజేశారు.

సీపీఎం గ్రామశాఖ కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి

మోత్కూరు, సెప్టెంబరు 14: మండలంలోని ముశిపట్ల సీపీఎం గ్రామశాఖ కార్యదర్శిగా పాటి శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు తెలిపారు. శనివారం ముశిపట్లలో జరిగిన గ్రామ శాఖ మహాసభలో ఈ ఎన్నిక జరిగిందన్నారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ పటిష్ఠతకు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఎస్ఐకి సన్మానం

మోత్కూరు, సెప్టెంబరు 14: మోత్కూరుకు బదిలీపై వచ్చిన ఎస్ఐ డి.నాగరాజును శనివారం బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ మండలంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకరావచ్చన్నారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, నోముల రమేష్ పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకు యూనియన్ ఫెడరేషన్ డైరెక్టర్‌గా తడక రమేష్

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 14: తెలంగాణ రాష్ట్ర అర్బన్ బ్యాంకు యూనియన్ ఫెడరేషన్ డైరెక్టర్‌గా భూదాన్‌పోచంపల్లిలోని ది పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంకు చైర్మన్ తడక రమేష్ నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర అర్బన్ బ్యాంకు యూనియన్ ఫెడరేషన్ ఎన్నికల కార్యక్రమంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో తడక రమేష్‌ను ఫెడరేషన్ చైర్మన్ వేమిరెడ్డి నర్సింహారెడ్డి నియమించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన బ్యాంకు యూనియన్ ఫెడరేషన్ చైర్మన్‌కు, పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

రామన్నపేట, సెప్టెంబరు 14: అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని బోగారానికి చెందిన చేనేత కార్మికుడు జెల్ల ప్రకాశ్ కుటుంబానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు కూనూరు సాయికుమార్‌గౌడ్ శనివారం రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాపోలు బలరాం, భువనరుషి, జెల్ల గోపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి జన్మదిన వేడుకలు

అడ్డగూడూరు, సెప్టెంబరు 14: టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. రవీందర్‌రావు, గూడేపు పాండు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవాన్ని విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే

భువనగిరి టౌన్, సెప్టెంబరు 14: టీపీసీసీ నూతన అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం భువనగిరిలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీ భవన్‌లో మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించనున్న ప్రమాణ స్వీకారోత్సవానికి కార్యకర్తలందరూ తరలిరావాలన్నారు. నూతన సారథి నాయకత్వంలో రాష్ట్రంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. పార్టీ కోసం శ్రమించే కార్యకర్తలకు, నాయకులకు పార్టీ అదిష్టానం గుర్తింపు ఇస్తుందన్నారు. మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు పోత్నక్ ప్రమోద్ కుమార్, తంగెళ్లపల్లి రవికుమార్, కూర వెంకటేష్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



ఇన్వెస్టర్ సెర్మనీలో విద్యార్థికి బాధ్యతలు అప్పగిస్తున్న ప్రిన్సిపాల్ నిరుపమ

బీబీనగర్, సెప్టెంబరు 14: విద్యార్థులకు అప్పగించిన బాధ్యతలను సద్వినియోగం చేసుకుని నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఆర్మీ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నిరుపమ సూచించారు. శనివారం బీబీనగర్ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ మహిళ డిగ్రీ కళాశాలలో ఇన్వెస్టర్ సెర్మని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలోని 38మంది ఆర్మీ విద్యార్థులకు కాలేజీ, డార్మెంటరి, మెన్స్ క్రీడా విభాగాల్లో లీడర్‌షిప్ బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఇచ్చిన హోదాలను ఉపయోగించుకుని సక్రమంగా బాధ్యతలు నిర్వర్తించి కాలేజీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు పుట్టుకతో లీడర్స్‌గా ఎదగరని ఇలాంటి బాధ్యతల ద్వారానే లీడర్ షిప్ లక్షణాలను పెంపొందించుకోవడానికి ఈ కళాశాల ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి రూప, డాక్టర్ కె శ్రీలత, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన చేనేత కార్మిక సంఘం ఎన్నికల ప్రచారం



చేనేత కార్మికులను ఓటు అడుగుతున్న అభ్యర్థి

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 14: భూదాన్‌పోచంపల్లిలోని పద్మశాలి చేనేత కార్మిక సంఘం కార్యవర్గం ఎన్నికలు పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ కమిటీ నిర్వహించనున్నది. సంఘంలో మొత్తం 2555 మంది సభ్యులున్నారు. అధ్యక్ష స్థానానికి బరిలో ఐదుగురిలో కేవలం నలుగురు మాత్రమే బరిలో ఉన్నారు. వారిలో అంకం పాండు, కొంక లక్ష్మీనారాయణ, ముసునూరి యాదగిరి, సీత కృష్ణ పోటీలో ఉన్నారు. ఎనిమిది డైరెక్టర్ స్థానాలకు 19 మంది బరిలో ఉన్నారు. రెండు మహిళా డైరెక్టర్ల స్థానాలకు నలుగురు బరిలో ఉన్నారు. వీరిలో ఎర్వ నీలమ్మ, గుండు రాజేశ్వరి, గుర్రం హేమలత, ముసునూరి లక్ష్మి బరిలో ఉన్నారు. శనివారం నాటికి వారు నిర్వహించిన ప్రచారం ముగిసింది. ఆదివారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పోలింగ్ నిర్వహిస్తారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సీత శ్రీరాములు శ్రేష్ఠి, ఉపాధ్యక్షులు అంకం మురళి, భారత బాలరత్నం, ఏలె భిక్షపతి, కడవేరు చంద్రమౌళి, గోలి యాదగిరి తదితరులు తెలిపారు. కాగా, ఈనెల 16న ఉదయం 9 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ తదుపరి ఫలితాలు వెల్లడిస్తామని వారు తెలిపారు.

సీపీఎం నేత రాజిరెడ్డి మృతి పట్ల సంతాపం

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 14 : సీపీఎం సీనియర్ నాయకులు మండల పరిధిలోని దోతిగూడెం గ్రామానికి చెందిన పగిళ్ల రాజిరెడ్డి మృతి పట్ల పార్టీ జిల్లా కమిటీ తరుపున సంతాపం ప్రకటిస్తున్నామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. శనివారం దోతిగూడెం గ్రామంలో పగిళ్ల రాజిరెడ్డి మృతి పట్ల సంతాపం తెలిపి, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, ఎండీ.పాషా, గంగదేవి సైదులు, మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, నాయకులు కోట రామచంద్రారెడ్డి, మంచాల మధు, ప్రసాదం విష్ణు, గూడూరు బుచ్చిరెడ్డిచ ముద్దం సత్తయ్య, నోముల కృష్ణారెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు పోరాటం



బొందుగులలో నారాయణరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

రాజాపేట, సెప్టెంబరు 14: నమ్మిన సిద్ధాంతం కోసం పేదల పక్షాన పోరాడి, అమరులైన వీర తెలంగాణ విప్లవ రైతాంగ సాయుధ పోరాట యోధుల ఆశయ సాధనకు నేటి యువత పోరాటం సాగించాలని సీపీఐ నాయకులు కోరారు. శనివారం రాజాపేట మండలం బొందుగుల గ్రామంలో సాయుధ పోరాట సమరయోధుడు సంఘం నారాయణరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోలూరి రాజయ్య, అన్నారు. నాయకులు చిగుర్లలింగం రాములు గణేష్, అయిలయ్య, నర్సింహులు, సత్తయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): తెలంగాణ సాయుధ పోరాట విలీన వారోత్సవ సభల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పల ముత్యాలు కోరారు. మండల కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు యోధుల పోరాటంతోనే తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిందని తెలిపారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం. ఎస్.లింగారెడ్డి, జె.రాములు, బి.లాల్‌రెడ్డి, కె.సత్తయ్య, వై. బుచ్చిరెడ్డి, ఎస్.పురుషోత్తం, ఎస్.నర్సింహ, అంజనేయులు, లింగయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాకారుల ఎంపిక పోటీలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 14: తెలంగాణ స్టేట్ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు శనివారం భువనగిరిలో ఉత్సాహంగా కొనసాగాయి. పలు విభాగాల్లో సాగిన పోటీలను మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు ప్రారంభించి, మాట్లాడుతూ క్రీడల్లో రాణించేందుకు విద్యార్థులు మైదానాల్లో శ్రమించాలన్నారు. విజేతలు ఈ నెల 19, 20న హైదరాబాద్‌లో జరిగే ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విజేతలకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోనేటి గోపాల్, సర్టిఫికెట్స్, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, పీఈటీలు దోనూరు శ్రీనివాస్, మాటూరి వినోద్, రఘువీర్ సింగ్, శ్రీను, అజయ్, లావణ్య, జ్యోతి, అనిత, మహేష్, శ్రవణ్ పాల్గొన్నారు.